www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

TELANGANA RISING CURE - PURE - RARE



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:81 WEDNESDAY , AUGUST 05, 2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 81 బుధవారం 05 ఆగష్టు 2026 పేజీలు :8 వెల: 4/-

# అక్కడకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారు



బీఆర్ఎస్‌కు క్షుద్రపూజలు చేయడం అలవాటని టీపీసీసీ చీఫ్ ఆరోపణ
మాజీ మంత్రి హరీశ్ రావు ఆలయాల పర్యటనలపై ప్రశ్నలు
జూన్ 2, జులై 23 తేదీల్లో హరీశ్ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్
పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్న మహేష్ గౌడ్
తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య

హంసకలం వార్త: బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం ఒక అలవాటుగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఇటీవల కొన్ని ఆలయాలను సందర్శించడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మిగతా2లో



## సెప్టెంబర్ 1 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ఇంటర్నెట్

హంసకలం వార్త: తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. మిగతా2లో

## జనసేనలోకి ఎంట్రీ పై క్లారిటీ ఇచ్చిన ఏవీ రంగనాథ్



- రాజకీయాల్లోకి వస్తాననే ప్రచారంలో నిజం లేదన్న ఏవీ రంగనాథ్
- పవన్ కల్యాణ్ చెరువు భూమిని ఆక్రమించలేదని స్పష్టీకరణ
- చిరంజీవి కుటుంబంతో 20 ఏళ్లుగా పరిచయం ఉందని వెల్లడి
- ఆయనను హైడ్రా కమిషనర్‌గా తొలగించాలని హైకోర్టు ఆదేశాలు

పవన్ భూవివాదం పై వివరణ

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై దాడులు



25 టన్నులకు పైగా సరుకు స్వాధీనం

-13 మసాలా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు చేశామన్న సజ్జనార్ ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు ఉపయోగిస్తున్నారని వెల్లడి -కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



## హిట్లర్ ఆదర్శంతో రేవంత్ రెడ్డి హైడ్రాను తెచ్చారు

హైడ్రా అనేది పేదలను భయభ్రాంతులకు గురి చేసే సంస్థ అన్న ఈటల

పేదల నివాసాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని మండిపాటు

కోర్టుల ఆదేశాలను కూడా హైడ్రా లెక్కచేయడం లేదని వ్యాఖ్య

హంసకలం వార్త: 'హైడ్రా'పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అనేది పేదల ఇళ్లను కూలగొట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఒక వేధింపుల సంస్థగా మారిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారులను నియమించే విచక్షణాధి మిగతా2లో



## ప్రభుత్వ ధాన్యం మళ్లిస్తే క్రిమినల్ కేసులు

హంసకలం వార్త : రాష్ట్రంలో కస్టమ్ మిల్లింగ్ బియ్యం బకాయిలు పడి, ప్రభుత్వ ధాన్యాన్ని మళ్లించిన డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడానికి సిద్ధమైంది. సచివాలయంలో పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. సీఎంఆర్ ప్రక్రియలోని ప్రతి ధాన్యపు గింజ ప్రజల ఆస్తి అని, ప్రజాధనంతో పాటు ప్రభుత్వ ధాన్యాన్ని రికవరీ చేయడానికే తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. 2లో

## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్



తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు

7 పేజీలతో నివేదికను పీసీసీ చీఫ్ కు అందించిన జగ్గారెడ్డి

హంసకలం వార్త: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి మిగతా2లో

## సౌందర్యానికి కిరీటం.. ఆత్మవిశ్వాసానికి చిరునామా - ఏ2ఎన్ ఎలైట్ మిసెస్ సౌత్ ఇండియా & ఏ2ఎన్ ఎలైట్ మిసెస్ తెలంగాణ విజేత మీనా ప్రకాష్ చౌదరి

( ఆగస్టు - 4- హంసకలం వార్త )

అందం అనేది కేవలం రూపంలో మాత్రమే ఉండదు. మంచి వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం,ఆలోచనా విధానం, సమాజానికి ఉపయోగపడాలనే తపన, నాయకత్వ లక్షణాలు కలిసి ఒక వ్యక్తిని నిజమైన విజేతగా నిలబెడతాయి. అలాంటి విశిష్ట లక్షణాలతో తనకం టూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మహిళ మీనా ప్రకాష్ చౌదరి. ఏ2ఎన్ ఎలైట్ మిసెస్ సౌత్ ఇండియా వేదికలో తన ప్రతిభతో మెరిసి విజేతగా నిలవడమే కాకుండా, ఏ 2 ఎన్ ఎలైట్ మిసెస్ తెలంగాణ కిరీటాన్ని కూడా అందుకుని మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచారు. ఈ విజయాలు కేవలం పోటీల్లో గెలిచిన కిరీటాలు మాత్రమే కాదు.



## హైదరాబాద్ కు భారీ వర్ష సూచన

హైదరాబాద్ లో నేడు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు



హంసకలం వార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తెలంగాణలో వర్షాలు విరామం లేకుండా కురుస్తున్నాయి. వీటి ప్రభావంతో నేడు హైదరాబాద్ నగరం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరిం చింది. ఈ మేరకు నగర ప్రజలను అప్రమ త్తం చేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.రాష్ట్రవ్యాప్తంగా మిగతా2లో

# అక్కడకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారు

బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం ఒక అలవాటుగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఇటీవల కొన్ని ఆలయాలను సందర్శించడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు. జూన్ 2న తిరుచ్చి, జులై 23న శివమొగ్గకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారని ఆయన నిలదీశారు. ఆయా తేదీల్లో హరీశ్ రావు ఎక్కడ ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలకు సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ వెల్లడించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల నమ్మకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. చేసిన తప్పులకు గాను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# సెప్టెంబర్ 1 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ఇంటర్నెట్

తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నా రు ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమా న్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువు లోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు.

# జనసేనలోకి ఎంట్రీపై క్లారిటీ ఇచ్చిన ఏవీ రంగనాథ్..

తాను రాజకీయాల్లోకి వస్తున్నానంటూ గత కొంత కాలంగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఫుల్‌స్టాప్ పెట్టారు. తన ఉద్యోగాన్ని ప్రశాంతంగా చేసుకోనివ్వాలని కోరుతూ, జనసేన పార్టీలో చేరతాననే వార్తలను ఆయన కొట్టిపారేశారు. ఇటీవల 'రా టాక్స్ విత్ వీకే' అనే యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు కీలక విషయాలపై స్పష్టత ఇచ్చారు. పవన్ కళ్యాణ్‌కు సంబంధించిన కోడి చెరువు భూ వివాదం, తనపై వెలువడిన కోర్టు ధిక్కరణ ఆరోపణలపైనా ఆయన వివరణ ఇచ్చారు. "నాకు మెగాస్టార్ చిరంజీవి గారి కుటుంబంతో గత 20 ఏళ్లుగా మంచి పరిచయం ఉంది. పవన్ కళ్యాణ్ గారితో కూడా సాన్నిహిత్యం ఉంది. అంతమాత్రానికే నేను ఉద్యోగానికి రాజీనామా చేసి జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్యేగానో, ఎంపీగానో పోటీ చేస్తానని ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్‌గానూ నన్నే నియమిస్తారని సోషల్ మీడియాలో రాస్తున్నారు. దయచేసి నా ఉద్యోగం నన్ను చేసుకోనివ్వండి. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనే నాకు లేదు" అని రంగనాథ్ స్పష్టం చేశారు.

**పవన్ భూమి వివాదంపై వివరణ**

గండిపేట సమీపంలోని జన్వాడలో ఉన్న పవన్ కళ్యాణ్ భూమిపై చెలరేగిన వివాదంపై రంగనాథ్ సాంకేతిక అంశాలను వివరించారు. కోడికుంట చెరువు వద్ద ఉన్న ఈ భూమి విషయంలో వాస్తవాలను ఆయన వెల్లడించారు. "పవన్ కళ్యాణ్ 2014లో నలుగురు రైతుల నుంచి సుమారు 10 ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేశారు. ఆ తర్వాత 2015-16లో చెరువుకు ప్రిలిమినరీ నోటిఫికేషన్, 2023లో ఫైనల్ నోటిఫికేషన్ జారీ అయింది. చాలా మంది కబ్జాదారులు చెరువులను మట్టితో పూడ్చి నిర్మాణాలు చేపడతారు. కానీ, ఈ భూమి విషయంలో అలా జరగలేదు. భూమి సహజ స్వరూపం ఏమాత్రం మారలేదు. నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగలేదు," అని రంగనాథ్ వివరించారు. అయితే, ఒక సాంకేతిక ఉల్లంఘన జరిగిందని ఆయన అంగీకరించారు. "చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం పరిధిలోకి వచ్చేలా ఫెన్సింగ్ వేశారు. ఇది నీటి ప్రవాహాన్ని ఆపకపోయినా, నిబంధనల ప్రకారం తప్పు. అందుకే ఆ ఫెన్సింగ్‌ను తొలగించాలని సూచించాం. ఇలాంటి పట్టా భూములు వేల సంఖ్యలో ఉన్నాయి. సోషల్ మీడియా ఒత్తిళ్లకు తలొగ్గకుండా, అన్ని కేసుల్లో ఒకేలా వ్యవహరిస్తాం," అని స్పష్టం చేశారు. చెరువుల్లోని పట్టా భూములను ఎవరైనా కొనుగోలు చేయవచ్చు, అమ్ముకోవచ్చు" అని రంగనాథ్ వివరించారు. ఇదిలా ఉండగా.. ఏవీ రంగనాథ్‌పై దాఖలైన పలు కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి కూల్చివేతలు చేపట్టారని మండిపడింది.

# సౌందర్యానికి కిరీటం.. ఆత్మవిశ్వాసానికి చిరునామా - ఏ2ఎన్ ఎలైట్ మిసెస్ సౌత్ ఇండియా & ఏ2ఎన్ ఎలైట్ మిసెస్ తెలంగాణ విజేత మీనా ప్రకాష్ చౌదరి

ప్రతి మహిళలో ఉన్న ఆత్మవిశ్వా సానికి, పట్టుదలకు, వ్యక్తిత్వ వికాసానికి లభించిన గౌరవం. కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ, సమాజంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కోవచ్చని మీనా ప్రకాష్ చౌదరి తన ప్రయాణంతో నిరూపించారు. సాధారణ మహిళ నుంచి స్ఫూర్తి దాయక వ్యక్తిత్వం వరకు ప్రతి విజయవంతమైన మహిళ వెనుక ఎన్నో కలలు, ఎన్నో సవాళ్లు, ఎన్నో త్యాగాలు ఉంటాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగిన మహిళే నిజమైన విజేత. మీనా ప్రకాష్ చౌదరి కూడా అలాంటి ప్రయాణాన్నే సాగించారు. ఆమె ప్రతి అడుగులోనూ ఆత్మవిశ్వా సాన్ని, క్రమశిక్షణను, సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించారు.

**-అందం అంటే ఆత్మవిశ్వాసం**

నేటి ప్రపంచంలో అందం అంటే కేవలం రూప సౌందర్యం మాత్రమే కాదు. వ్యక్తిత్వం, కమ్యూనికేషన్ నైపుణ్యం, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సమాజంపై అవగాహన---ఇవన్నీ కలిసే నిజమైన అందాన్ని నిర్మిస్తాయి. మీనా ప్రకాష్ చౌదరి ఈ విలువలను తన ప్రదర్శన ద్వారా చాటిచెప్పారు.

**-పోటీలో ప్రతిభకు గుర్తింపు**

ఏ2 ఎన్ ఎలైట్ వేదికలో ఆమె చూపిన ప్రతిభ, స్టేజ్ ప్రెజెన్స్, కమ్యూనికేషన్ నైపుణ్యం, సంప్రదాయం మరియు ఆధునికతకు సమతుల్యత కల్పించిన తీరు న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. ప్రతి రౌండ్‌లో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి విజేతగా నిలిచారు.

**-మహిళా సాధికారతకు ప్రతీక**

ఈ విజయం మహిళలందరికీ ఒక సందేశం. వివాహం తర్వాత కూడా మహిళలు తమ కలలను సాకారం చేసుకోవచ్చు. కుటుంబానికి అండగా నిలుస్తూనే తమ వ్యక్తిత్వాన్ని ప్రపంచానికి చాటవచ్చు. మీనా ప్రకాష్ చౌదరి అదే సందేశాన్ని తన విజయంతో అందించారు.

**-యువతకు స్ఫూర్తి**

యువతలో, ముఖ్యంగా యువ మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడంలో ఇలాంటి విజయాలు ఎంతో ప్రేరణనిస్తాయి. ఓటమిని భయపడకుండా, నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగితే విజయం తప్పకుండా లభిస్తుందనే నమ్మకాన్ని ఆమె ప్రయాణం కలిగిస్తోంది.

**-కుటుంబం -- విజయానికి బలమైన పునాది**

ఒక మహిళ విజయానికి కుటుంబ సహకారం ఎంతో కీలకం. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, విశ్వాసం, ప్రేమ ఆమె ప్రయాణాన్ని మరింత బలపరిచాయి. వ్యక్తిగత జీవితం, సామాజిక బాధ్యతలు, వ్యక్తిత్వ వికాసం-ఈ మూడింటి మధ్య సమతుల్యతను ఆమె నిలబెట్టుకున్నారు.

**-సమాజానికి సందేశం**

మహిళలకు అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతాలు సృష్టించగలరని మీనా ప్రకాష్ చౌదరి విజయం మరోసారి నిరూపించింది. ఆత్మవిశ్వాసం, కృషి, క్రమశిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాన్ని చేరుకోవచ్చని ఆమె ప్రస్థానం చెబుతోంది.

**-భవిష్యత్తు లక్ష్యాలు**

భవిష్యత్తులో మరింత మంది మహిళలకు స్ఫూర్తిగా నిలవడం, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, మహిళా సాధికారత కోసం పనిచేయడం వంటి లక్ష్యాలతో ఆమె ముందుకు సాగుతున్నారు. అందం మాత్రమే కాదు, ఆలోచన, సేవాభావం, సమాజం పై బాధ్యత కూడా ప్రతి మహిళలో ఉండాలని ఆమె విశ్వసిస్తున్నారు.

**-ముగింపు**

ఏ2ఎన్ ఎలైట్ మిసెస్ సౌత్ ఇండియా విజేత, ఏ2



ఎన్ ఎలైట్ మిసెస్ తెలంగాణ విజేతగా మీనా ప్రకాష్ చౌదరి సాధించిన విజయాలు మహిళలందరికీ గర్వకారణం. ఆమె సాధించిన కిరీటాలు కేవలం వ్యక్తిగత విజయాలు మాత్రమే కాదు; ప్రతి మహిళ తన కలలను నమ్మి ముందుకు సాగితే అసాధ్యం ఏదీ లేదని నిరూపించే ప్రేరణాత్మక గాథ. ఆమె ప్రయాణం రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలవాలని, మహిళా సాధికారతకు మరింత బలాన్నివ్వాలని ఆకాంక్షిద్దాం. పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసం ఉంటే ప్రతి మహిళ తన జీవితంలో విజేతగా నిలవగలదనే సందేశాన్ని మీనా ప్రకాష్ చౌదరి విజయగాథ చిరస్థాయిగా నిలిపింది.

# ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే 'ఫస్ట్ బాస్' అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు.

# హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై దాడులు

భాగ్యనగరంలో కల్తీ మసాలా తయారీ కేంద్రాలే లక్ష్యంగా ఎ-ఖీూు బృందాలు మెరుపు దాడులు నిర్వహించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సోదాల్లో 25 టన్నులకు పైగా కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటివరకు మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి నిత్యం వాడే మసాలా దినుసుల్లో తీవ్రస్థాయిలో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించామని సజ్జనార్ తెలిపారు. ఆకర్షణీయమైన మెరుపు, రంగు కోసం ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. దాడుల సందర్భంగా సుమారు 89 టన్నుల ముడి పదార్థాలను సీజ్ చేసి, నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించామని తెలిపారు. కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి రసాయనాలతో కూడిన కల్తీ మసాలాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు, జీర్ణక్రియ సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ఎ-ఖీూు బృందం ఏర్పడిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో సోదాలు చేసి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహారాన్ని సీజ్ చేశామని వెల్లడించారు. నగరంలో కల్తీ ఆహారంపై ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# హిట్లర్ ఆదర్శంతో రేవంత్ రెడ్డి హైడ్రాను తెచ్చారు

'హైడ్రా'పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అనేది పేదల ఇళ్లను కూలగొట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఒక వేధింపుల సంస్థగా మారిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారులను నియమించే విచక్షణాధికారం ఉండవచ్చు కానీ, పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసే అధికారం మాత్రం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హైడ్రాను స్థాపించారని ఈటల అన్నారు. నాడు హిట్లర్ ప్రజలను వేధించి తీవ్ర విధ్వంసం సృష్టిస్తే, నేడు రేవంత్ రెడ్డి హైడ్రా ద్వారా తెలంగాణ ప్రజలను అదే రీతిలో వేధిస్తున్నారని ఆరోపించారు. నలభై, యాభై ఏళ్ల క్రితం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి చెరువులు, కాలువల పక్కన రెక్కల కష్టం మీద ఇళ్లు కట్టుకున్న పేదల నివాసాలను ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన బడా బాబులకు భూములు కట్టబెట్టడానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవారిని బ్లాక్‌మెయిల్ చేయడానికే రేవంత్ రెడ్డి హైడ్రాను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని ఈటల విమర్శించారు. ప్రస్తుతం నగరంలో హైడ్రా భయంతో ఇల్లు కొనడానికి కూడా ప్రజలు జంకుతున్నారని వ్యాఖ్యానించారు. రెవెన్యూ, మున్సిపల్, హోం శాఖల కంటే హైడ్రా ఒక సుప్రీం శాఖలా వ్యవహరిస్తోందని, ఆఖరికి కోర్టుల ఆదేశాలను కూడా లెక్క చేయడం లేదని ధ్వజమెత్తారు. అసలు ఈ సంస్థ సీఎం రేవంత్ రెడ్డి మాటైనా వింటుందో లేదో అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు.

## ప్రభుత్వ ధాన్యం మళ్లిస్తే క్రిమినల్ కేసులు

సీఎంఆర్ ప్రక్రియలోని ప్రతి ధాన్యపు గింజ ప్రజల ఆస్తి అని, ప్రజాధనంతో పాటు ప్రభుత్వ ధాన్యాన్ని రికవరీ చేయడానికే తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. గత 10 నుంచి 12 ఏళ్ల కాలంలో జరిగిన సీఎంఆర్ కార్యకలాపాలపై సమగ్రమైన 'ప్రత్యేక ఆడిట్' నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. మిల్లుల వారీగా పక్కా ప్రణాళికతో, నిర్దిష్ట కాలపరిమితితో బకాయి ఉన్న బియ్యం, నగదు లేదా ధాన్యాన్ని రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన మిల్లర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడమే కాకుండా, బ్యాంకు గ్యారంటీలను నెరవేర్చి ఆస్తుల జప్తు ప్రక్రియను వేగవంతం చేయాలని, విజిలెన్స్ తనిఖీలను విస్తృతం చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. భవిష్యత్తులో ధాన్యం మళ్లింపును నిరోధించడానికి ఎర్లీ వార్నింగ్ సిస్టమ్, క్యూఆర్ కోడ్ కలిగిన గన్నీ బ్యాగులు, వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ వంటి సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. సీఎంఆర్ నిబంధనలను మరింత కఠినతరం చేసేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. అయితే నిజాయితీగా పనిచేసే మిల్లర్లకు ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. అదే సమయంలో రైతుల వద్ద నుంచి కనీస మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు, నేరుగా ఖాతాల్లోకి నగదు జమ ప్రక్రియలు ఎప్పటిలాగే పారదర్శకంగా సాగుతాయని మంత్రి స్పష్టం చేశారు.

# హైదరాబాద్ కు భారీ వర్ష సూచన..

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తెలంగాణలో వర్షాలు విరామం లేకుండా కురుస్తున్నాయి. వీటి ప్రభావంతో నేడు హైదరాబాద్ నగరం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు నగర ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుందని, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిన్న హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వర్షం ముంచెత్తింది. గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 18.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా... వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రోడ్లపైకి వస్తున్న వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# సంపాదకీయం

## కూటమి ప్రభుత్వంపై ఆదివాసీల కోటి ఆశలు




అడవిని, భూమిని, ప్రకృతి వనరులను నమ్ముకుని జీవించే ఆదివాసీల జీవన విధానాన్ని, సంస్కృతిని, ఉపాధిని కాపాడేందుకు అనేక ప్రత్యేక చట్టాలు, విధానాలు అమలులోకి వచ్చాయి. అయితే నేడు ఆ చట్టాలు కల్పించిన హక్కులకు భంగం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. న్యాయపరంగా ఏర్పడ్డ కొన్ని అంశాల ఆధారంగా గిరిజనేతరులు వ్యవహరిస్తున్న తీరుతో ఆదివాసి సమాజం తీవ్ర అన్యాయానికి గురవుతున్నది. ఆదివాసీలు రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని కాపాడుకోవడానికి పోరుబాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది.ఆదివాసీ ప్రాంతాల పాలన కోసం రాజ్యాంగం 5వ షెడ్యూల్‌లో నియమ నిబంధనలు పొందుపరిచారు. షెడ్యూల్డ్ ప్రాంత స్థానిక ఆదివాసీ అభ్యర్థులతోనే ఉద్యోగాలు భర్తీ చేసేందుకు వీలుగా 2000 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో 3ను తీసుకువచ్చి ఉద్యోగ నియామకాల్లో ఆదివాసీలకు 100శాతం రిజర్వేషన్ కల్పించింది. దీనిని వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన కేసులో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 2020లో జీవో 3ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. దాంతో నిరుద్యోగ ఆదివాసీలకు తెలుగు రాష్ట్రాలలో జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది. అప్పటి నుంచి నేటి వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆదివాసీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆదివాసీలకు ఉద్యోగ నియామకాల్లో మళ్లీ 100శాతం రిజర్వేషన్ కల్పిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల ముందు నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయినా అది అమలుకాలేదు.

అటవీ ప్రాంతాల్లో ఆదివాసీ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలను తెచ్చారు. షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్ 1/70 అటువంటిదే. ఇది షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీ భూముల పరిరక్షణకు బలమైన కవచంగా ఉంది. దీనిని నిర్వీర్యం చేయాలని గిరిజనేతరులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అనేక గ్రామాలు, మండల కేంద్రాలలో గిరిజనేతరులు అధిక సంఖ్యలో ఉన్నారని, దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న వీరికి భూములు కొనుగోలు చేయడానికి లేదా కౌలుకు తీసుకోవడానికి ఈ చట్టం వల్ల అవకాశం లేకుండా పోయిందని వారు పేర్కొంటూ కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం ఈ చట్టం న్యాయ పరిశీలనను ఎదుర్కొంటోంది. ఈ చట్టాన్ని కోర్టు రద్దు చేస్తే తమ భవిష్యత్ ఏమిటని ఆదివాసీలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా ఎప్పటి నుంచో జోన్--1లో ఉంది. దానిని జోన్--2లో కలిపారు. దీనివల్ల విద్య, ఉపాధి అవకాశాలలో మరింత వెనుకబడిపోతామని ఆదివాసీలు ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతున్నారు. జీవో 3 బదులుగా రాజ్యాంగ నిబంధనలు, చట్టాలు, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి 'షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం' రూపొందించాలి. లేదా 5వ షెడ్యూల్ క్లాస్--2 ప్రకారం ఆదివాసీ ప్రాంతంలో 100శాతం రిజర్వేషన్ ఇస్తూ ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి, దానికి రాష్ట్రపతి ఆమోదం పొందాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్ 1/70 చట్టం రద్దు కోరుతూ సుప్రీంకోర్టులో ఉన్న కేసులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసి చట్ట పరిరక్షణ బాధ్యతను స్వీకరించాలని; అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్--1 లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్--1లోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అలాగే ఆదివాసీలకు నూరు శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి అన్ని మార్గాలనూ అన్వేషించి పూర్తి న్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మరోసారి ఆదేశించారు. అయితే వీటి కార్యరూపం కోసం ఆదివాసీ సమాజం ఎదురుచూస్తోంది.

ఆదివాసీల సంక్షేమం అంటే కేవలం పింఛన్లు, సంక్షేమ పథకాలు మాత్రమే కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం, ఉపాధి అవకాశాలను కాపాడడం, భూమిని రక్షించడం, వారి సంస్కృతిని గౌరవించడం కూడా. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్టు పలుమార్లు ప్రకటించింది. అదే స్ఫూర్తితో ఆదివాసీల న్యాయమైన ఆందోళనలను కూడా సానుకూలంగా పరిశీలించి, వారి హక్కులు, అవకాశాలు, భవిష్యత్తు దెబ్బతినకుండా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి. హక్కుల పరిరక్షణతో పాటు అభివృద్ధి కూడా అందేవిధంగా ప్రభుత్వం ముందుకు సాగితేనే ఆదివాసీ సమాజానికి నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది.

# కాలానికి కత్తిరింపులు- యుగాలకు కుదింపులు!

కాలాన్ని కత్తిరించవచ్చు! యుగాలను కుదించవచ్చు! వినటానికి ఇదంతా వింతగానూ అనిపించొచ్చు! కృతకంగానే కనిపించొచ్చు! కానీ ఈ కృతకత్వమే ఇప్పుడు మహాకార్యంలా సాగిపోతోంది. ఎన్సీఈఆర్టీ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్) పాఠ్యపుస్తకాల్లో ఈ కృత్రిమ కత్తిరింపులు సాగిపోతూనే ఉన్నాయి. మరోవంక నగరాల పేర్లూ మారిపోతున్నాయి. ఎందుకు ఇదంతా జరుగుతోందని ప్రశ్నించుకుంటే ఒక దృష్టి కనపడుతుంది. చరిత్ర గురించి ఒక అంచనా స్పష్టమవుతుంది. కాలాల కత్తిరింపులకూ యుగాల కుదింపులకూ మూలాలన్నీ ఇందులోనే ఉన్నాయి. క్రీస్తుశకం 1200లకు ముందు మనకంతా స్వర్ణయుగమేననీ ఆ తర్వాతే బానిసయుగం మొదలైందనే అంచనాతోనే పాఠ్యపుస్తకాల్లో ఈ మార్పులు జరుగుతున్నాయి. బానిసయుగం క్రీస్తుశకం 1200లోనే ఎందుకు ప్రారంభమైందన్న భావనకు అనూహ్యమైన కారణమేమీ లేదు. ముస్లిం సుల్తానుల పాలనతో (1206) బానిసయుగం మొదలైందనే ఆలోచనే దీని వెనుక ఉంది. ఈ బానిస యుగాన్ని ముస్లిం పాలనకే పరిమితం చేయలేదు. బ్రిటిషు పాలనకూ విస్తరించారు. కానీ ప్రధానంగా దాన్ని ముస్లిం నవాబులు, మొఘలు పాదుషాల పాలన చుట్టూ కేంద్రీకరించి, చరిత్ర పాఠాల్లో సంస్కరణలు మొదలుపెట్టారు. నవాబులు, పాదుషాల పాలనకు అధిక ప్రాధాన్యం ఇచ్చి మన చరిత్ర పాఠ్యపుస్తకాలను తయారుచేశారనీ.. అంటే బానిసయుగంపై అనుచితంగా దృష్టిపెట్టారనీ.. దీన్ని సవరించటమే తమ ఉద్దేశమని ఎన్సీఈఆర్టీ సమర్థించుకుంది. పాలకపార్టీ నేతలు కూడా దాన్నే పదేపదే చెప్పారు. మొత్తంమీద మన చరిత్రలో 700 సంవత్సరాల 'బానిసత్వం'పై 2014 తర్వాత చర్చ బాగా మొదలైంది. ప్రధాని మోదీ దీని గురించి పలుచోట్ల విపులంగా మాట్లాడారు. 'భారతదేశం సుమారు 700 సంవత్సరాలు బానిసత్వాన్ని అనుభవించింది. ఈ దీర్ఘకాల బానిసత్వం వల్ల మన ఆత్మవిశ్వాసం, మన సంస్కృతి, మన జాతీయ చైతన్యం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ఆ బానిస మనస్తత్వం నుంచి పూర్తిగా బయటపడాలి. స్వతంత్ర భారతదేశం తన వారసత్వంపై గర్వపడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి'. ఇవి ప్రధాని మోదీ అన్న మాటలు. ఇందులో 'మన ఆత్మవిశ్వాసం', 'మన సంస్కృతి', 'మన జాతీయ చైతన్యం' అన్న మూడు విషయాలు చాలా కీలకమైనవి. ఈ మూడు 700 సంవత్సరాల కాలంలో దారుణంగా దెబ్బతిన్నాయనటానికి చరిత్రలో మనకు ఆధారాలు దొరకవు. సంపద సృష్టించే శ్రామికవర్గాలు ఏ దశలోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. రైతులు పంటలు పండిస్తూనే వచ్చారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవటమూ మానలేదు. సంపదను పెంచటంలో అలసత్వాన్నీ ప్రదర్శించలేదు. పొగాకు, మిరపకాయ, మొక్కజొన్న, బంగాళాదుంప, టమాటా, బొప్పాయి, జీడిపప్పు, అనాసపండు, సీతాఫలం, పుచ్చకాయ, కర్బూజ, బాదం, పాలకూర, దానిమ్మ లాంటివన్నీ 'బానిసత్వ' కాలంలోనే విదేశాల నుంచి ఇక్కడకు వచ్చాయి. ఇవన్నీ రైతులు స్వీకరించి ఇక్కడ సాగుచేశారు. కొన్నిటిని విస్తృతంగానూ, కొన్నిటిని పరిమితంగానూ పండించారు. వస్త్రపరిశ్రమ అభివృద్ధికి విశేషంగా తోడ్పడిన చరఖా (స్పిన్నింగ్ వీల్), పత్తిని ఏకే విల్లు, తివాచీల అల్లిక, మెరుగుపూత పూసిన మట్టిపాత్రలు, బావుల నుంచి నీటిని తోడటాన్ని సులభతరం చేసిన పర్షియన్ చక్రం (ధున్కీ), కాగితం తయారీ, తుపాకులు, ఫిరంగుల నిర్మాణం, కమానులు, గుమ్మటాలు నిర్మించే శిల్పచాతుర్యం, సున్నపు గారా (లైమ్ మోర్టార్), ముద్రణ యంత్రం, ఇనుము--ఉక్కు పరిశ్రమల్లో నాణ్యతా ప్రమాణాలు పెరగటం లాంటివన్నీ 'బానిసత్వ' యుగంలోనే దేశంలో ప్రవేశించి విశేషమార్పులకు దోహదం చేశాయి. వ్యవసాయం, చేతివృత్తులు, పరిశ్రమల తీరును తీవ్రంగా ప్రభావితం చేసిన ఆ కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ఆత్మవిశ్వాసం కోల్పోయిన ప్రజలు అంత తేలికగా అందుకోలేరు. ప్రయోగశీలతే ఆత్మవిశ్వాసంపై ఆధారపడి ఉంటుంది.

పాలకులది ఇస్లాం మతం కాబట్టి, రాజకీయ కారణాలతో వారు కొన్నిచోట్ల గుళ్లుగోపురాలను ధ్వంసం చేసిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని 700 సంవత్సరాల కాలాన్ని మన సంస్కృతి బాగా దెబ్బతిన్న యుగంగా భావించలేం. కులంపై ఆధారపడిన మన సామాజిక వ్యవస్థను ముస్లిం పాలకులు విచ్ఛిన్నం చేయలేదు. అలా విచ్ఛిన్నం చేయాల్సిన రాజకీయ అవసరం వాళ్లకి కనిపించలేదు. ఆ అవసరం ఉండి ఉంటే దాన్ని చేసి ఉండేవాళ్లేమో. ఏ యుగంలోనైనా రాజకీయ అవసరం దేన్నైయినా చేయిస్తుంది. కులవ్యవస్థ వల్ల పన్నులను రాబట్టడం సులభం అయింది. శిస్తులు, పన్నులు వసూలుచేసే జమీందార్లు రైతు కులాల నుంచే వచ్చారు. వాళ్లకు తోడుగా ఉండే మజుందార్లు, మున్షీలు, కరణాలు, కులకర్ణీలు, దేశ్‌పాండేలు బ్రాహ్మణ కులాల నుంచే వచ్చారు. వీళ్లపైనే ఆధారపడి ముస్లిం పాలకులు అధికారాన్ని చలాయించారు.

ఏ సంస్కృతీ మార్పుచెందకుండా ఉండదు. 700 ఏళ్లల్లో భారత్ అనేక సంస్కృతుల ప్రభావానికి లోనైంది. అన్యమతాల ప్రభావంతో సర్వం నాశనమైందనుకుంటే అంతా చీకటిగానే కన్పిస్తుంది. ఎంతో గొప్ప సాహిత్యాన్ని సృష్టించిన భక్తి ఉద్యమం ఆ 700 ఏళ్ల కాలంలోనే బలపడి ప్రజలపై విశేష ప్రభావాన్ని కలగచేసింది. బలవంతపు మతమార్పిడులు పెద్దఎత్తున జరిగి ఉంటే మన సమాజ ముఖచిత్రమే మారిపోయి ఉండేది. ఇక మధ్యయుగాల్లో జాతీయ చైతన్యం గురించి ఎక్కువగా చెప్పుకోటానికి ఉండదు. మనమందరం ఒక జాతికి చెందినవారమనే భావన మధ్యయుగాల్లో ఎక్కడా లేదు. ఇది భారతదేశానికే పరిమితమైంది కాదు. యూరపులోనూ ఆనాడు జాతీయ భావన లేదు. దేశమంతా అనేక రాజ్యాలుగా విడిపోయి ఉన్న కాలంలో మనమంతా భారతీయులమనే భావననే ఊహించలేం. జాతీయ భావన ఉంటే హిందూ పాలకులు ఏకమై ఉండేవారు. విదేశాల నుంచి వచ్చిన పాలకులకు వ్యతిరేకంగా సంఘటితం అయ్యేవారు. అదెప్పుడూ జరగలేదు. హిందూ పాలకులు ముస్లిం సైన్య విభాగాలను ఏర్పాటుచేసుకుని శత్రువులపై దండెత్తిన ఘటనలు బోలెడు ఉన్నాయి. ఆనాడు విధేయత కులాలకు, తెగలకు, చిన్న ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండేది.

ప్రతి యుగంలోనూ మంచీచెడులు ఉంటాయి. ఒక మతానికి చెందిన పాలకులందరినీ ఒకేగాటన కట్టటం సంకుచితమే అవుతుంది. మతదృష్టితో 700 సంవత్సరాల చరిత్రను కుదించివేసి, ఆ కాలంలో వచ్చిన మార్పులను విద్యార్థులకు సమగ్రంగా పరిచయం చేయకపోతే జరిగే నష్టమే ఎక్కువ. మనకు ఇష్టమున్నా లేకపోయినా మొఘలు సామ్రాజ్యకాలంలో దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయి. పాలకుల మతం ఏదైనా పాలన జనరంజకంగా ఉందా? జనవినాశనంగా ఉందా? అన్నదే ప్రధానంగా చూడాలి. ప్రపంచ వస్తుసేవల ఉత్పత్తిలో (జీడీపీ) మొఘల్ పాలన ఉచ్ఛదశలో ఉన్నకాలంలో (1700) భారత్ వాటా 25శాతం ఉండేది. చైనా వాటా కూడా ఇంచుమించు అంతే. రెండు దేశాల జనాభా కూడా సమానంగానే ఉండేదని చరిత్రకారులు లెక్కలు కట్టారు. వస్త్ర ఎగుమతుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానాన్ని సంపాదించింది. మసాలాదినుసులు, నీలిమందు, పట్టు, చేతివృత్తుల ఉత్పత్తులను విస్తృతంగా ఎగుమతి చేసేది. పర్షియా, మధ్య ఆసియా, యూరపు, ఆగ్నేయాసియా దేశాల్లో భారత ఉత్పత్తులకు విపరీతంగా గిరాకీ ఉండేది. ఇంతటి వైవిధ్యభరితమైన ఆర్థిక వ్యవస్థ ఉండి, వెండి నగదు చలామణి అధికంగా ఉన్న మొఘల్ పాలనాకాలానికి చరిత్రలో ప్రాధాన్యాన్ని తగ్గించి వేయటం మన చరిత్రను మనమే తక్కువ చేసుకోవటం అవుతుంది. హిందూ రాజుల పాలనకు తగినంత ప్రాధాన్యం ఇవ్వలేదనే వాదనతో మొఘల్ చరిత్రకు కత్తెర వేయటాన్ని సమర్థించుకుంటున్నారు గానీ అది వాస్తవాల ముందట నిలబడదు. సంగమ సాహిత్యం, చోళ, పాండ్య రాజుల ప్రస్తావన లేకుండా తమిళనాడులో చరిత్ర బోధన ఉంటుందా? అలాగే శాతవాహన, కాకతీయ, విజయనగర తదితర సామ్రాజ్యాలకు అగ్రస్థానం లేకుండా తెలుగు చరిత్ర పాఠాలు ఉంటాయా? ప్రతి భాషా రాష్ట్రమూ సొంత ప్రాంతంలో స్థానిక రాజ్యాలకు పెద్దపీట వేసింది. ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశాల్లో మొఘల్ చరిత్రను కుదించటానికి ఇతర రాజ్యాలకు ఎక్కువ చోటు ఇవ్వటం అసలు కారణం కాదు. 700 సంవత్సరాల బానిసత్వం అనే సూత్రీకరణతో




చరిత్రను అపసవ్య దృష్టితో చూడటంలోనే మూలం ఉంది.

అనేక ప్రభావాలతో దేశంలో ఏర్పడిన ఉమ్మడి సంస్కృతిని కృత్రిమంగా కత్తిరించి తమకు ఇష్టమైన ముక్కలను మాత్రమే చూపించటానికి ఎన్ని విన్యాసాలు చేసినా సఫలీకృతం కాలేరు. దేశంలో చరిత్ర పరిశోధనలను పటుత్వం లేకుండా చేయొచ్చు. పాఠ్యాంశాలను మతదృష్టితో సంకుచితం చేయొచ్చు. కానీ ప్రతిష్ఠాత్మక ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో భారత చరిత్రపై సాగే పరిశోధనలను ఆపలేరు. సుదీర్ఘ చరిత్రలోని మంచిచెడులపై నిష్పాక్షిక అంచనాలను అరికట్టలేరు. ఇంటర్నెట్ యుగంలో, సోషల్ మీడియా ఉధృతిలో ఏకపక్ష దృష్టితో చరిత్రను శాసించటం కుదరదు. దీన్ని గ్రహించటానికి ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు. మన తెలుగుభాషను చూస్తేనే 700 ఏళ్ల కాలం ప్రభావం ఎంత ప్రగాఢంగా ఉందో అర్థమవుతుంది. పర్షియన్, అరబ్బీ, ఉర్దూ నుంచి వచ్చిన అనేక పదాల్లేకుండా ఈనాటి తెలుగును ఊహించలేం. అవి లేకుండా సంభాషణలను చేయలేం.

దుకాణం, బజారు, ఖర్చు, ఖరీదు, నగదు, బాకీ, కిస్తీ, గోదాం, తుపాకీ, బురుజు, వకీలు, జరిమానా, ఖైదీ, దస్తావేజు, సర్కార్, ఖజానా, ఖాతా, రసీదు, శిస్తు, పట్వారీ, తహసీల్దార్, తాలూకా, జమీందార్, పరగణా, ఇనాం, జాగీరు, కౌలు, పట్టా, రైతు, సర్దార్, సిపాయి, బయానా, నాజూకు, దర్జా, దర్జీ, గులాబీ, ఖరారు, జమానా, రివాజు, మజా, హుషారు, జోష్, ఖతం, పునాది, కబురు, జాగా, అసలు, మామూలు, తయారు, రోజు, హుకుం, బందోబస్తు, ఫిర్యాదు, అర్జీ, మంజూరు, దలాల్, మాల్, జవాబు, ఖుషీ, దోస్తు, మెహందీ, హల్వా, పులావు, బిర్యానీ, అత్తరు, కుర్చీ, పైజామా, పరదా, రుమాలు, గల్లీ, దర్వాజా, నకిలీ, సవాల్, ముక్తసరి, తారీఖు, తర్జుమా, కాగితం, కలం, సిరా, హైరానా, జల్సా, మైదానం, టోపీ, తమాషా, హద్దు, సరిహద్దు, జిల్లా, రవాణా, జమాబందీ, తరాజు, తనఖా, జమ, జెండా, వసూలు, రద్దు, దావా, రాజీనామా, దఫా, జప్తు, జామీను, కబ్జా, ఫైసలా, హాజరు, గైరుహాజరు, మాఫీ, హక్కు, మున్సిఫ్, దఖలు, దగుల్బాజీ, హవాలా, ఖరీఫ్, రబీ, సబబు, సరంజామా, భర్తీ, భరోసా, హోదా, సరఫరా, సదరు, సతాయించు, సంజాయిషీ, షరతు, బేష్, హంగామా, హడావుడి, ఉడాయింపు, షరా, ఆసామీ, ఆలుగడ్డ లాంటి పదాలెన్నో తెలుగులో చేరిపోయాయి. సీపీ బ్రౌన్ మిశ్రమభాషా నిఘంటువు చూస్తే ఇంకా ఎన్నో పదాలు ఇలాంటివి కనపడతాయి.

సంస్కృతుల మధ్య ఇచ్చిపుచ్చుకోటాలు ఉండవనే దృష్టితో చూస్తే భారతీయతే అర్థంకాదు. బయట నుంచి వచ్చిన పాలకులు అన్యమతస్థులైనా ఇక్కడ ప్రజల్నీ సమాజాన్నీ అధోగతి పాలుచేశారా, పురోగతివైపు నడిపించారా? అన్నది చూడటమే చరిత్రలో ముఖ్యం. మధ్య ఆసియా నుంచి ఇక్కడకు వచ్చిన ఆర్యులకైనా, మరొకరికైనా ఇదే వర్తిస్తుంది.

## నిజాంపేట్ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోనాల పండుగ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం





నిజాంపేట్, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )

ఆగస్టు 9, 2026 (ఆదివారం) జరగనున్న బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు నిజాంపేట్ గ్రామంలో వెలసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కొలన్ నరసింహారెడ్డి (లీడర్), కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ గోపాల్ రెడ్డితో పాటు నిజాంపేట్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని బోనాల పండుగ నిర్వహణ, భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రత, పరిశుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిజాంపేట్ గ్రామ ప్రజలందరూ ఐక్యంగా పాల్గొని ఈ ఏడాది బోనాల మహోత్స వాలను మరింత వైభవంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సాయిలు యాదవ్, కుమార్ యాదవ్, రాజమోహన్ రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రవి యాదవ్, కె. లక్ష్మారెడ్డి, ప్రేమ్ కుమార్, జగన్ యాదవ్, నరసింహ చారి, కమ్మటి ఎల్లయ్య, కమ్మటి భరత్, కుమ్మరి బిక్షపతి, కుమ్మరి వెంకటేష్, కుమ్మరి కుమార్, బక్క చిన్న నరసింహా, దుర్గయ్య, మేకల నాగేష్, బక్క రాజు, గండని రాము, బైండ్ల గణేష్, ఆశి యాదయ్యతో పాటు నిజాంపేట్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అల్లాపూర్ డివిజన్‌లో అధ్వానంగా మారిన రోడ్లు- అధికారులను నిలదీసిన బండి రమేష్




**-ఈ-బ్లాక్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి**

**- సంబంధిత అధికారులకు ఆదేశం**



హైదరాబాద్, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దర్‌నగర్ ప్రాంతంలో మంగళవారం పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగు నెలల క్రితం ఇదే ప్రాంతంలో నిర్వహించిన పాదయాత్రలో గుర్తించిన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం బాధాకరమని అన్నారు. ముఖ్యంగా ఈ-బ్లాక్ రోడ్డు నిర్మాణం జిహెచ్ఎంసి , వాటర్ వర్క్స్ శాఖల మధ్య సమన్వయ లోపంతో నిలిచిపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం కూకట్‌పల్లి జోన్ జిహెచ్ఎంసి అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన బండి రమేష్, ఇప్పటికే నిధులు మంజూరైన ఈ-బ్లాక్ రోడ్డు పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాకాలంలో రోడ్డు అధ్వాన్నంగా మారడంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మంజీరా పైప్‌లైన్ పనులను సాకుగా చూపుతూ రోడ్డు పనులను నిలిపివేయడం సమంజసం కాదని, అవసరమైతే వాటర్ వర్క్స్ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలను బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాజీద్ పాషా, అబ్దుల్లా, లక్ష్మణ్ గౌడ్, సాయి తులసి, రేష్మ, లక్ష్మి, రాము, రాంబాబు, శంకర్, నరసింహ, నరసింహ యాదవ్, వేణు, సతీష్తో పాటు స్థానిక కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# వరంగల్, హనుమకొండ బస్టాండ్లలో టి జి ఎస్ ఆర్టిసి ఎండీ నాగిరెడ్డి ఆకస్మిక తనిఖీలు

వరంగల్:( ఆగస్టు - 4- హంస కలంవార్త )

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ( టి జి ఎస్ ఆర్ టి సి) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి వరంగల్, హనుమకొండ ప్రధాన బస్టాండ్లు, హనుమకొండ డిపోలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులకు అందు తున్న సేవలు, డిపో నిర్వహణ, మౌలిక సదుపా యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భ ంగా వరంగల్ నగర ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ' పథకం కింద మరో 100 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం వరంగల్ రీజియన్‌లో 112 ఎలక్ట్రిక్ బస్సులువిజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. బస్టాండ్లలో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మహిళా ప్రయాణికుల భద్రత, వెయిటింగ్ హాళ్ల నిర్వహణ, బస్సుల సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అనంతరం రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశమైన నాగిరెడ్డి బస్సు రూట్లు, ఆక్యుపెన్సీ నిష్పత్తి, ఉద్యోగుల సమస్యలపై సమీక్ష నిర్వహించారు.ఆర్టీసీపై ప్రజల నమ్మకాన్ని



నిలబెట్టుకుంటూ సురక్షితమైన, నాణ్యమైన ప్రయాణాన్ని అందించడమే సంస్థ ప్రధాన ధ్యేయమని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ప్రయాణికులకు సేవలంది ంచడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించబోమని, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహిం చాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 9 వేలకుపైగా బస్సుల ద్వారా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాలో ప్రజా రవాణా సేవలను మరింత ఆధునీకరించి, ప్రయాణికులకు సురక్షిత మైన, వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాజశేఖర్, చీఫ్ సివిల్ ఇంజినీర్ కవిత, వరంగల్ రీజినల్ మేనేజర్ భవానీ ప్రసాద్‌తో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జీడిమెట్ల ఇండస్ట్రియల్ ప్రాంతంలోని ఎం టి ఏ ఆర్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఈ ఓ యు కంపెనీలో ఫిక్స్డ్ టర్మ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



( ఆగస్టు - 4- హంస కలంవార్త )

బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి డిమాండ్‌జీడిమెట్ల ఇండస్ట్రియల్ ప్రాంతంలోని ఎం టి ఏ ఆర్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఈ ఓ యు కంపెనీలో పనిచేస్తున్న ఫిక్స్డ్ టర్మ్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.తమను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని కోరుతూ గత ఐదు రోజులుగా నిరసన చేపడుతున్న కార్మికుల దీక్షా శిబిరాన్ని మంగళవారం రాగిడి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ నారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను తెలుసుకుని వారి న్యాయమైన డిమాండ్లకు పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, దీర్ఘకాలంగా సంస్థకు సేవలందిస్తున్న ఫిక్స్డ్ టర్మ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయడం యాజమాన్యం బాధ్యత అని అన్నారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు.కార్మికుల ప్రతినిధులతో జరిగిన చర్చల అనంతరం, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) శనివారం వచ్చి సమస్యపై చర్చించి పరిష్కారం చూపుతారని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు.ఒకవేళ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారిని రెగ్యులరైజ్ చేయకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపట్టి కార్మికులకు అండగా నిలుస్తామని రాగిడి లక్ష్మారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు సుశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాచిగూడలో 68.90 గ్రాముల చరస్ స్వాధీనం హర్యానాకు చెందిన వ్యక్తి అరెస్ట్



హైదరాబాద్, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )

కాచిగూడ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో హర్యానాకు చెందిన విక్రమ్ అనే వ్యక్తి వద్ద నుంచి 68.90 గ్రాముల చరస్ స్వాధీనం చేసుకున్నట్లు సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిరణ్ తెలిపారు.విచారణలో ఇదే నిందితుడు గతంలో ముషీరాబాద్ మహంకాళి ఆలయం సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న సమయంలో కూడా ఎక్సైజ్ అధికారులకు పట్టుబడినట్లు వెల్లడించారు.నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న 68.90 గ్రాముల చరస్‌తో పాటు 154 క్వార్టర్ మద్యం బాటిళ్లను ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిరణ్ తెలిపారు. నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## శేర్లింగంపల్లిలో 1.426 కిలోల గంజాయి స్వాధీనం.. ఒకరు అరెస్ట్, ఇద్దరు పరారీలో



హైదరాబాద్, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని శేర్లింగంపల్లి ప్రాంతంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి నిర్వహించి 1.426 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో రాజవర్ధన్ రెడ్డి అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 1.426 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో రేవంత్, సాయి అనే మరో ఇద్దరు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని, వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ వెల్లడించారు. ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అరెస్టు చేసిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న గంజాయిని తదుపరి విచారణ నిమిత్తం శేర్లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్కు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది

## అల్కాపురి కాలనీలో 11.22 గ్రాముల ఓజీ కుష్ స్వాధీనం.. ఒకరు అరెస్ట్



హైదరాబాద్, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )

అల్కాపురి కాలనీలో మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిపై ఎస్టీఎఫ్--డి టీమ్ దాడి నిర్వహించి 11.22 గ్రాముల ఓజీ కుష్ ( ఓ జి కుష్ ) స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసింది. ఎస్టీఎఫ్--డి టీమ్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం, రావుల వేణు (26) అనే వ్యక్తి ఓజీ కుష్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి నిర్వహించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 11.22 గ్రాముల ఓజీ కుష్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఓజీ కుష్ సరఫరా చేస్తున్న నవీన్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పరారీలో ఉన్న అతడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అరెస్టు చేసిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న ఓజీ కుష్‌ను తదుపరి విచారణ నిమిత్తం సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్కు అప్పగించినట్లు సీఐ నాగరాజు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 11.22 గ్రాముల ఓజీ కుష్ విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది.

## కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ సీనియర్ సిటిజన్స్ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తాం: వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్‌పల్లి, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )



కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్స్ పార్క్‌ను రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించారు. సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు, వసంత్‌నగర్ డివిజన్ కోఆర్డినేటర్ గురుప్రసాద్ ఆహ్వానం మేరకు పార్కును పరిశీలించిన ఆయన, వృద్ధులు ప్రశాంతంగా విహరించేలా అన్ని మౌలిక సదుపాయాలతో పార్కును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు పార్కులో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాకింగ్ ట్రాక్ ఆధునీకరణ, కూర్చునే బెంచీల ఏర్పాటు, పచ్చదనం పెంపు, తాగునీటి సౌకర్యం, మెరుగైన లైటింగ్‌తో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సభ్యుల వినతులను ఓర్పుగా విన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఈ సమస్యలను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి, ఎంపీ నిధుల ద్వారా సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి అవసరమైన ప్రతి కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అలాగే, సీనియర్ సిటిజన్స్ ప్రతిరోజూ యోగా, ఆరోగ్య సాధనతో పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహించు కునేందుకు వారి విజ్ఞప్తి మేరకు యోగా కార్పెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ రాజేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేశబత్తుల సుధ, ప్రీతం రెడ్డి, ఎం. కోటేశ్వరరావు, సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు సుబ్బరాజు, శివశంకర్ రెడ్డి, ప్రొఫెసర్ అప్పారావు, రామకృష్ణ, భానుమతి, గాయత్రి, రమణారావు, జనార్ధన్, కొండరెడ్డి, స్థానిక నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# డల్లాస్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం





-ఎన్ఆర్ఐ టీపీసీసీ, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం

-'ఆట' మహాసభల అనంతరం డల్లాస్ చేరుకున్న ఉప ముఖ్యమంత్రి

- రెండు రోజుల పర్యటనలో కీలక పారిశ్రామిక సమావేశాలు

డల్లాస్ (అమెరికా),( ఆగస్టు - 4- హంస కలంవార్త )

అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు డల్లాస్ నగరంలో ఘన స్వాగతం లభించింది. బాల్టిమోర్ నగరంలో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన 'ఆట' (అమెరికన్ తెలుగు అసోసియేషన్ - ఏ టి ఏ ) మహాసభల్లో పాల్గొన్న అనంతరం ఆయన డల్లాస్ చేరుకున్నారు. డల్లాస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి ఎన్ఆర్ఐ టీపీసీసీ మరియు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ( ఐఓసీ ) ప్రతినిధులు, నాయకులు, ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఉప ముఖ్యమంత్రి రాకతో డల్లాస్‌లోని తెలంగాణ ప్రవాస భారతీయుల్లో ప్రత్యేక ఉత్సాహం నెలకొంది. తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారు అభినందించారు. డల్లాస్‌లో రెండు రోజుల పాటు పర్యటించనున్న భట్టి విక్రమార్క పలు కీలక సమావేశాల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, భవిష్యత్ అవసరాలకు కీలకమైన క్రిటికల్ మినరల్స్ (క్రిటికల్ మినిరాల్స్ ) రంగంలో సహకార అవకాశాలపై సింగరేణి అధికారుల బృందంతో కలిసి వివిధ బహుళజాతి సంస్థల ప్రతినిధులతో విస్తృతస్థాయి చర్చలు జరపనున్నారు. అత్యాధునిక సాంకేతికత, పెట్టుబడులు, వ్యూహాత్మక భాగస్వామ్యాలపై జరిగే ఈ సమావేశాలు తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధికి ఉపయోగపడనున్నాయని అధికారులు భావిస్తున్నారు. డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికిన వారిలో నెహ్రూ కొమ్మినేని, అచ్యుత్ తుమ్మల, మధు ఇరుగు, వసంత్ బొబ్బల, రాజ్ బెజ్జల, హరి నాథ్ శీలం, వడ్డే రాజేష్, ప్రమోద్ రెడ్డి, రిషిత్ సలవాది, రేవంత్ రెడ్డి, దుష్యంత్ బొక్క, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# జై రామ్ నగర్‌లో ప్రజా సేవలు, అభివృద్ధి పనులు, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి





హైదరాబాద్, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని జై రామ్ నగర్లో నిర్వహించిన పలు ప్రజా సేవా, అభివృద్ధి కార్యక్రమాలను బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి మంగళవారం పరిశీలించారు. ముందుగా డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ( డి సి డి పి ) అవగాహన కార్యక్రమాన్ని సందర్శించి, ఇండియా పోస్ట్ ద్వారా అందిస్తున్న పోస్టల్ సేవింగ్స్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్, ఆధార్, పాస్‌పోర్ట్, బీమా సేవలతో పాటు, పోస్టాఫీస్ ఖాతాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ఆర్థిక సేవలు, ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రయోజనాలపై అధికారులతో కలిసి అవగాహన కల్పించారు. అనంతరం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా మంజూరైన కొత్త బోర్ పాయింట్ ఏర్పాటుకు సంబంధించి సంబంధిత అధికారులు, కాలనీ ప్రతినిధులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కాలనీ ప్రజల అవసరాలకు అనుగుణంగా బోర్ పాయింట్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమాన్ని కూడా పరిశీలించిన చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడి కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి



పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సులభంగా చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు.

# "ఫీజు బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమంలో భరత్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో వినూత్న నిరసన



-ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

హైదరాబాద్, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్‌నగర్ కూరగాయల మార్కెట్లో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన "ఫీజు బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర యువమోర్చా కార్యదర్శి హరి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వినూత్న నిరసనలో పాల్గొన్న రాజేశ్వరరావు, మార్కెట్‌లో కూరగాయలు విక్రయించడం, కూరగాయల బస్తాలు మోయడం, రోడ్లు ఊడవడం వంటి కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వ్యాపారులు, కార్మికులు, స్థానిక ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల అంశాన్ని







వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, "ప్రభుత్వానికి నిధులు లేకుంటే మేమే మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతాం... బస్తాలు మోస్తాం... రోడ్లు ఊడుస్తాం... వాటితో వచ్చిన డబ్బును ప్రభుత్వానికి అందిస్తాం. కానీ పేద విద్యార్థుల భవిష్యత్తుతో మాత్రం చెలగాటం ఆడవద్దు" అని అన్నారు. ప్రజల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ వ్యాపారులు, కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విద్యార్థులకు సంఘీభావం తెలిపారు.

# సఫ్దర్‌నగర్ ‘ ఈ’ బ్లాక్‌లో శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం ఘనంగా





-ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

హైదరాబాద్, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్‌నగర్ ‘ ఈ’ బ్లాక్లో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారి ఆషాఢ మాస బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు, స్థానిక ప్రజలకు, మహిళలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు మాట్లాడుతూ సఫ్దర్‌నగర్ ‘ ఈ’ బ్లాక్ కాలనీతో పాటు శ్రీ కట్ట మైసమ్మ దేవాలయ అభివృద్ధికి సహకారం అందించాలని వడ్డేపల్లి రాజేశ్వరరావును కోరారు. తమ ప్రాంతంలో రోడ్లు, మౌలిక సదుపాయాలు, దేవాలయ అభివృద్ధి వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు, కాలనీ ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దేవాలయ అభివృద్ధితో పాటు కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: వడ్డేపల్లి రాజేశ్వరరావు







-వివేకానంద నగర్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ‘10 కోట్ల మాదకద్రవ్యాల రహిత ప్రతిజ్ఞ’ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం

హైదరాబాద్, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )

కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో, నశా ముక్త్ భారత్ అభియాన్ మరియు మిషన్ స్పందన్ కార్యక్రమాల భాగంగా నిర్వహిస్తున్న “10 కోట్ల మాదకద్రవ్యాల రహిత ప్రతిజ్ఞ (10 క్రోర్స్ డ్రగ్స్ - ఫ్రీ ప్లేడ్జెస్ మెగా కాంపెయిన్ )” ప్రచార కార్యక్రమాన్ని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వర రావు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన మాదకద్రవ్యాల రహిత భారత నిర్మాణ సందేశం దేశ యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే ప్రతి యువకుడు తన ప్రతిభ, నైపుణ్యం, ఆవిష్కరణలతో దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాడని ప్రధాని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. మాదకద్రవ్యాల వ్యసనం ఒక్క వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ఆయన అన్నారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడటం ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి సామాజిక సంస్థతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ రాజయోగ ధ్యానం, ఆధ్యాత్మిక విలువలు, నైతిక బోధనల ద్వారా దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక చైతన్యాన్ని విస్తృతంగా కల్పిస్తోందని ప్రశంసించారు. “జన్ భాగీదారి” స్ఫూర్తితో ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని, ఆగస్టు 6 నుంచి 20 వరకు నిర్వహించనున్న “10 కోట్ల మాదకద్రవ్యాల రహిత ప్రతిజ్ఞ” కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రతిజ్ఞ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు నశా ముక్త్ భారత్ అత్యంత అవసరమని, ఆరోగ్యవంతమైన, వ్యసన రహిత యువతే దేశానికి నిజమైన సంపద అని వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, యువత, మహిళలు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల రహిత భారత నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నిర్వాహకులు ముఖ్య అతిథి వడ్డేపల్లి రాజేశ్వరరావును ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సమస్యలపై సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమీక్ష

-సీఎంసీ కమిషనర్ సృజనకు వినతులు వెల్లువెత్తిన ప్రజలు, ప్రజాప్రతినిధులు



బాలానగర్, ( ఆగస్టు - 4- హంస కలంవార్త )



సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మంగళవారం బాలానగర్ డివిజన్‌లోని రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి కమిషనర్‌కు స్వాగతం పలికారు. సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ, భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి కళ్యాణినగర్ కాలనీ తీవ్ర ముంపునకు గురవుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే చెరబండ రాజునగర్‌లోని శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వివిధ కాలనీల ప్రతినిధులు డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం, వర్షపు నీటి నిల్వ తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. నాలుగు నెలల తర్వాత మళ్లీ వస్తా: కమిషనర్ సృజన సమావేశంలో కమిషనర్ సృజన మాట్లాడుతూ, ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను నమోదు చేస్తున్నామని, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తన పరిధిలోని ప్రతి డివిజన్‌ను ప్రత్యక్షంగా సందర్శిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకు నేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తెలిపిన సమస్యలను కేవలం నమోదు చేయడానికే పరిమితం కాకుండా, వాటి పరిష్కార పురోగతిని తెలియజేసేందుకు నాలుగు నుంచి ఐదు నెలల తర్వాత మళ్లీ ఇదే ప్రాంతాన్ని సందర్శించి సమీక్షిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లిగారి లక్ష్మయ్య, ఏ-బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బందిగా బాల నరసింహ, మేడ్చల్ ఫిషర్‌మెన్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల నరేందర్ ముదిరాజ్, బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, కళ్యాణినగర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసఫ్, బాలానగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు డా. కిరణ్, బాలానగర్ డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కవిత కాతురాయ, వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో కల్తీ మసాలాలపై హెచ్ - ఫాస్ట్ భారీ దాడులు









-25 టన్నుల కల్తీ సుగంధ ద్రవ్యాలు స్వాధీనం -- ముగ్గురు అరెస్ట్, మూడు కేసులు నమోదు

హైదరాబాద్,( ఆగస్టు - 4- హంస కలంవార్త )

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ సుగంధ ద్రవ్యాల తయారీ, విక్రయ కేంద్రాలపై హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ ( హెచ్- ఫాస్ట్), జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగంతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీ స్థాయిలో కల్తీ మసాలాలు, ప్రమాదకర రసాయనాలు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజల నుంచి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో 13 మసాలా తయారీ, ప్రాసెసింగ్, విక్రయ కేంద్రాల్లో సోదాలు చేపట్టి సుమారు 25.3 టన్నుల కల్తీ సుగంధ ద్రవ్యాలను సీజ్ చేశారు. ఈ వ్యవహారంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసులు, బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

అరెస్టు చేసిన నిందితులు

- రాహుల్ భాటి (కాటేదాన్)
- విశాల్ పన్వార్ (బేగంబజార్)
-దులీచంద్ కచ్చవా (బేగంబజార్)

తనిఖీల్లో వెలుగుచూసిన అంశాలు

అధిక లాభాల కోసం వాము, జీలకర్ర, షాజీరా, లవంగాలు, ఆవాలు తదితర సుగంధ ద్రవ్యాల్లో సింథటిక్ ఫుడ్ కలర్స్, గుడ్డల రంగులు (ఫాబ్రిక్ డ్యేస్ ), పారిశ్రామిక రంగులు, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలను కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. కొన్ని కేంద్రాల్లో నాసిరకం ముడి సరుకుకు రంగులు, రసాయనాలు కలిపి మెరుపు, బరువు పెంచి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు బయటపడింది.

సీజ్ చేసిన ప్రధాన సరుకులు

- వాము -- 7,920 కిలోలు
-జీలకర్ర -- 6,700 కిలోలు
- షాజీరా -- 2,280 కిలోలు
- ఆవాలు -- 4,960 కిలోలు
- లవంగాలు -- 550 కిలోలు
- సోంపు -- 540 కిలోలు
- జీలకర్ర డస్ట్ -- 2,350 కిలోలు
-సింథటిక్ డైలు, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్, రోలింగ్ మెషిన్లు తదితర వస్తువులు కూడా స్వాధీనం చేసుకున్నారు.

140 రోజుల్లో హెచ్- ఫాస్ట్ భారీ విజయాలు

H-FAST ప్రారంభమైన 140 రోజుల్లో:

-659 దాడులు
- 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు
-246 టన్నులకుపైగా కల్తీ ఆహార పదార్థాల స్వాధీనం
-232 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి అప్పగింపు

ఈ కాలంలో కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్, సింథటిక్ పనీర్, కల్తీ పెరుగు, నెయ్యి, నూనెలు, కుళ్లిన మాంసం, రసాయనాలతో మగ్గించిన పండ్లు, కల్తీ టీ పొడి, ఊరగాయలు తదితర ఆహార పదార్థాలను కూడా భారీగా స్వాధీనం చేసుకున్నారు.

ప్రజలకు హెచ్చరిక

హైదరాబాద్ సిటీ పోలీసులు, హెచ్- ఫాస్ట్ అధికారులు ప్రజలకు పలు సూచనలు చేశారు:

-ఆహార పదార్థాలను ఫస్సై లైసెన్స్ ఉన్న దుకాణాల నుంచే కొనుగోలు చేయాలి.
- అత్యంత ప్రకాశవంతమైన రంగుల్లో ఉండే మసాలాలను కొనుగోలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలి.
- బ్రాండ్ లేని, రోడ్డు పక్కన విక్రయించే లూజ్ ఆహార పదార్థాలను కొనరాదు.
- ఆహార కల్తీపై సమాచారం ఉంటే వెంటనే డయల్-100 లేదా హెచ్- ఫాస్ట్ హెల్ప్‌లైన్: 8712661212 (కాల్/వాట్సాప్) ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

ఈ ప్రత్యేక తనిఖీలను హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్లు రంజిత్, అంజయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్లు శంకర్, కృష్ణ, అఖిల్ మరియు హెచ్- ఫాస్ట్ బృందం నిర్వహించింది.

హైదరాబాద్ నగరంలో ఆహార కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఐపీఎస్ పిలుపునిచ్చారు.

# బిజినెస్

## వై-ఫై, టీవీ, ఓటీటీ ఒకే ప్యాక్‌లో.. జియో కొత్త ప్లాన్లు




జియో హోమ్ తన వినియోగదారుల కోసం కొత్త 3-ఇన్-1 సర్వీస్ ప్యాక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒకే ప్లాన్‌లో బ్రాడ్‌బ్యాండ్ వై-ఫై, 1,000కుపైగా లైవ్ టీవీ ఛానళ్లు, 12 ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల సౌకర్యాన్ని కలిపి అందిస్తోంది. విడివిడిగా ప్లాన్లు తీసుకోవడంతో పోలిస్తే తక్కువ ఖర్చుతో ఈ సేవలు లభిస్తాయని సంస్థ తెలిపింది. కొత్తగా రెండు 3-ఇన్-1 ప్లాన్లను ప్రవేశపెట్టింది. 2o1 నెలల ప్లాన్ ధర రూ.2,122. ఇందులో నెలకు రూ.707 చొప్పున 100 బ్రాడ్‌బ్యాండ్ వేగంతో పాటు 1,000కుపైగా లైవ్ టీవీ ఛానళ్లు, 12 ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల యాక్సెస్ లభిస్తుంది. 3o1 నెలల ప్లాన్ ధర రూ.2,222. ఇందులో నెలకు రూ.555 చొప్పున 30 వీఎజూం బ్రాడ్‌బ్యాండ్ వేగం, 1,000కుపైగా లైవ్ టీవీ ఛానళ్లు, 12 ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల సౌకర్యం ఉంటుంది. జియో కొత్తగా టీవీ-ఓన్లీ ప్లాన్లను కూడా ప్రకటించింది. ఐదు నెలల ప్లాన్ ధర రూ.2,000. నెలకు రూ.400 చొప్పున 1,000కుపైగా లైవ్ టీవీ ఛానళ్లు, 200కుపైగా హెచ్‌డీ ఛానళ్లు, 15కుపైగా ప్రాంతీయ భాషల కంటెంట్ అందుబాటులో ఉంటుంది. ఇదే ప్లాన్ రెండు నెలల కాలపరిమితితో రూ.1,000కు కూడా లభిస్తుంది. ఈ ప్లాన్లకు రూ.200 సెటప్ ఫీజు చెల్లించాలి. అలాగే వై-ఫై-ఓన్లీ ప్లాన్లను కూడా జియో అందుబాటులోకి తెచ్చింది. 100 వీఎజూం వేగంతో ఐదు నెలల ప్లాన్ ధర రూ.3,000. నెలకు రూ.600 చొప్పున ఉంటుంది. రెండు నెలల ప్లాన్ ధర రూ.1,500. దీనికి రూ.300 సెటప్ ఫీజు ఉంటుంది. 30 వీఎజూం వేగంతో ఐదు నెలల ప్లాన్ ధర రూ.2,200. నెలకు రూ.450 చొప్పున ఖర్చవుతుంది. రెండు నెలల ప్లాన్ రూ.1,100కు లభిస్తుంది.

## ఈ20 పెట్రోల్ కల్తీపై కేంద్రం స్పష్టత- రోజుకు 12 సార్లు నాణ్యత పరీక్షలు



ఈ20 పెట్రోల్ నాణ్యతపై వస్తున్న సందేహాలకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం స్పష్టత ఇచ్చింది. దేశవ్యాప్తంగా ఇంధన నాణ్యతను చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపింది. ప్రస్తుతం 87 వేలకు పైగా పెట్రోల్ బంకుల్లో రోజుకు 8 నుంచి 12 సార్లు కలుషిత/కల్తీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. దేశంలో ఇప్పటివరకు క్లోరైడ్ కలుషితానికి సంబంధించిన రెండు ఘటనలు మాత్రమే గుర్తించినట్లు పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆ రెండు పెట్రోల్ బంకుల్లో ఇంధన విక్రయాలను వెంటనే నిలిపివేసినట్లు పేర్కొంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 2 వేలకుపైగా ఇంధన నమూనాలను క్లోరైడ్, సల్ఫైడ్ కలుషితానికి పరీక్షించినట్లు వెల్లడించింది. ఎక్కడైనా కలుషితం లేదా కల్తీ బయటపడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. ఇంధన సరఫరా వ్యవస్థ మొత్తాన్ని ఓఎంసీలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించినట్లు తెలిపింది. ఈ20లో కలిపే ఇథనాల్ తప్పనిసరిగా బీఐఎస్ ఐఎస్ 15464 ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని కేంద్రం తెలిపింది. ఇథనాల్ స్వచ్ఛత కనీసం 99.6 శాతం ఉండాలని పేర్కొంది. ప్రతి సరఫరాతో పాటు నాణ్యత ధ్రువీకరణ నివేదిక తప్పనిసరిగా ఉండాలని వెల్లడించింది. ఇథనాల్ నిల్వకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ప్రతి ట్యాంకర్‌ను స్వీకరించే ముందు పైభాగం, దిగువ భాగం నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించింది. ప్రతి డెలివరీకి ముందు కూడా నాణ్యత తనిఖీలు తప్పనిసరిగా చేస్తున్నట్లు పేర్కొంది. 2024 జులై నుంచి 2026 జూన్ వరకు నాణ్యత ప్రమాణాలు పాటించని 302 ట్యాంకర్లను తిరస్కరించినట్లు కేంద్రం వెల్లడించింది. వీటిలో దాదాపు 10,500 కిలోలీటర్ల ఇథనాల్ ఉన్నట్లు తెలిపింది.

## మీ ఫోన్‌కు స్పామ్ కాల్స్ వస్తున్నాయా?- 263 సంస్థలను బ్లాక్‌లిస్ట్ చేసిన కేంద్రం!



దేశవ్యాప్తంగా మొబైల్ వినియోగదారులను వేధిస్తున్న అనవసర వాణిజ్య కాల్స్, సందేశాలపై (యూసీసీ) కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) ఏకంగా 1,83,000 టెలికాం వనరులపై చర్యలు తీసుకున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ నేడు వెల్లడించింది. నిబంధనలు ఉల్లంఘించిన 263 టెలిమార్కెటింగ్ సంస్థలను (సెండర్స్) బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినట్లు స్పష్టం చేసింది. ఈ మూడు నెలల కాలంలో దేశంలోని టెలికాం నెట్‌వర్క్‌లో మొత్తం 73,082 కోట్ల కాల్స్ చోటుచేసుకోగా, వాటిలో 10.85 లక్షల ఫిర్యాదులు స్పామ్ కాల్స్‌కు సంబంధించి నమోదయ్యాయి. అంటే, ప్రతి పది లక్షల కాల్స్‌కు సగటున 1.5 ఫిర్యాదులు అందినట్లు ప్రభుత్వం పేర్కొంది. మొత్తం ఫిర్యాదుల్లో 89 శాతం 'ట్రాయ్'కు చెందిన డీఎన్డీ (డీఎన్‌డీ) యాప్ ద్వారానే వచ్చినట్లు తెలిపింది. స్పామ్ కాల్స్‌ను అరికట్టేందుకు బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగా అవుట్‌గోయింగ్ కాల్స్ నిలిపివేయడం, సిమ్ కార్డులను దీర్ఘకాలికంగా డిస్‌కనెక్ట్ చేయడం, అన్ని ఆపరేటర్ల నెట్‌వర్క్‌లలో సెండర్లను బ్లాక్‌లిస్ట్ చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని మంత్రిత్వ శాఖ వివరించింది. టెక్నాలజీ సాయంతో కూడా స్పామ్ కాల్స్‌కు కళ్లెం వేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఏఐ ఆధారిత వ్యవస్థ ద్వారా సుమారు 2,443 కోట్ల అనుమానిత స్పామ్ కాల్స్, ఎస్సెమ్మెస్‌లను గుర్తించినట్లు వెల్లడించింది. దీనివల్ల వినియో గదారులు అప్రమత్తమై, ఆ కాల్స్‌ను తిరస్కరి ంచడానికి లేదా జాగ్రత్తగా స్వీకరించడానికి అవకాశం కలిగింది. అంతేగాక అనుమానిత సెండర్లకు కేవలం వారం రోజుల్లోనే 2.43 లక్షల హెచ్చరిక నోటిఫి కేషన్లు జారీ చేసినట్లు పేర్కొంది. వినియోగదారులు తమకు అనవసర ప్రచార కాల్స్, సందేశాలు రాకుండా ఉండేందుకు డీఎన్డీ సేవలను వినియో గించుకో వాలని ప్రభుత్వం సూచించింది. ట్రాయ్ డీఎన్డీ యాప్, టెలికాం సర్వీస్ ప్రొవైడర్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా, లేదా 1909 నంబర్‌కు కాల్ చేసి గానీ, ఎస్సెమ్మెస్ పంపి గానీ డీఎన్డీ ప్రాధాన్యతలను నమోదు చేసుకోవచ్చు. అయితే, ఇప్పటికీ దేశంలో 112 కోట్ల మందికి పైగా సబ్‌స్క్రైబర్లు డీఎన్డీ కోసం నమోదు చేసుకోలేదని, దీంతో వారికి రిజిస్టర్డ్ టెలిమార్కెటర్ల నుంచి వాణిజ్య సందేశాలు వస్తున్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. డీఎన్డీ నమోదు చేసుకున్న వారి ఫోన్లకు 148 కోట్ల ప్రచార కాల్స్, 730 కోట్ల ప్రచార ఎస్సెమ్మెస్‌లు రాకుండా విజయవంతంగా అడ్డుకున్నట్లు వివరించింది. వినియోగదారుల సౌలభ్యం కోసం ప్రచార కాల్స్‌కు 140 సిరీస్‌ను, బ్యాంకింగ్, ఫైనాన్స్, ప్రభుత్వ సేవల వంటి లావాదేవీల కాల్స్‌కు 1600 సిరీస్‌ను ట్రాయ్ ప్రత్యేకంగా కేటాయించిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ నంబర్ల ద్వారా కాల్స్ వస్తే వాటిని సులభంగా గుర్తించే వీలుంటుంది.

## టీమిండియాలో షమీకి దారులు మూసుకున్నట్టేనా?.. సెలక్టర్ల సందేశం ఇదే!



టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తరచూ గాయాల బారిన పడటం జట్టు యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఆడినప్పటికీ, శ్రీలంకతో జరగబోయే టెస్ట్ సిరీస్‌కు బుమ్రా మరోసారి గాయంతో దూరమయ్యాడు. అతని స్థానంలో జమ్మూ కశ్మీర్ యువ పేసర్ ఆకిబ్ నబీకి బీసీసీఐ అవకాశం కల్పించింది. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన నబీకి చోటు దక్కడంపై హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ, ఈ నిర్ణయం సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ కెరీర్‌పై తీవ్రమైన ప్రశ్నలను రేకెత్తిస్తోంది.గత కొంతకాలంగా షమీ టీమిండియాకు దూరంగా ఉంటున్నాడు. అతను 2023 నుంచి టెస్టులకు, గత ఏడాది నుంచి వన్డేలకు, 2025 నుంచి టీ20లకు ఎంపిక కాలేదు. తొలుత ఫిట్‌నెస్ సమస్యలతో పక్కనపెట్టినా, గత ఏడాదిగా దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నప్పటికీ జాతీయ జట్టులోకి అతనికి పిలుపు అందడం లేదు.షమీ పునరాగమనంపై బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను ప్రశ్నించగా, టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన ఫిట్‌నెస్ అతనికి లేదని స్పష్టం చేశాడు. అయితే, వాస్తవ గణాంకాలు మరోలా ఉన్నాయి. షమీ తన చివరి ఏడు రంజీ ట్రోఫీ మ్యాచ్‌లలో ఏకంగా 1383 బంతులు వేసి, 16.72 సగటుతో 37 వికెట్లు పడగొట్టాడు. ఇందులో మూడుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన, కెరీర్ బెస్ట్ గణాంకాలు (8/90) కూడా ఉన్నాయి. ఇంత శ్రమించినా ఫిట్‌నెస్ లేదనడం చర్చనీయాంశంగా మారింది.మరోవైపు శ్రీలంకతో సిరీస్‌కు ఎంపికైన ఆకిబ్ నబీ రంజీ సీజన్‌లో అద్భుతంగా రాణించాడు. కేవలం 12.56 సగటుతో 60 వికెట్లు తీసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతని ప్రదర్శనకు గుర్తింపు లభించింది.ఈ ఎంపికతో అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ షమీకి, ఇతర సీనియర్ ఆటగాళ్లకు ఒక స్పష్టమైన సందేశం పంపినట్లు కనిపిస్తోంది. కేవలం దేశవాళీలో రాణిస్తే సరిపోదు, జాతీయ జట్టులో చోటు కోసం పోటీ పడుతున్న యువ ఆటగాళ్ల కంటే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, పూర్తి ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సిందే. ఇకపై యువ ఆటగాళ్లు కేవలం జట్టును నింపడానికి కాకుండా, వారి ప్రదర్శన ఆధారంగా నేరుగా తుది జట్టులో స్థానం కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో షమీ తిరిగి జట్టులోకి రావడం మరింత కష్టతరం కానుంది.

## టీమిండియాలో కలకలం.. కోచ్ గౌతం గంభీర్‌పై సీనియర్ల ఫిర్యాదు?



భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కోచింగ్ శైలిపై జట్టులోని కొందరు సీనియర్ ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. రాహుల్ ద్రవిడ్ తర్వాత కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గంభీర్ పద్ధతులపై తమకున్న అభ్యంతరాలను కొందరు సీనియర్లు... మాజీ క్రికెటర్లతో పాటు బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లోని సభ్యులకు అనధికారికంగా తెలియజేసినట్లు సమాచారం. ఈ పరిణామంతో గంభీర్‌పై ఒత్తిడి పెరుగుతోంది.జట్టు ఓటమికి గంభీర్ బాధ్యత స్వీకరించడానికి ఇష్టపడటం లేదని, ఓటమి భారాన్ని ఆటగాళ్లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లేదా సహాయక సిబ్బందిపై నెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఓ నివేదిక పేర్కొంది. ఓటమికి కారణం యాజమాన్య నిర్ణయాలు కాదన్నట్లుగా అతను వ్యవహరిస్తున్నాడని, ఈ భావనే ఆటగాళ్లలో అసంతృప్తికి కారణమవుతోందని తెలుస్తోంది. ఈ వ్యవహారం డ్రెస్సింగ్ రూమ్‌లోనూ చర్చనీయాంశంగా మారినట్లు సమాచారం. ఈ పరిణామాలపై బోర్డు అధికారులు కూడా ఆందోళన చెందుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ అనధికారిక ఫిర్యాదులు, ఆరోపణలు ఎలా ఉన్నప్పటికీ గౌతమ్ గంభీర్‌పై బీసీసీఐ పూర్తి విశ్వాసంతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. జట్టులో ఇప్పటికీ అతడే కీలక అధికారిగా, సర్వాధికారాలు కలిగిన వ్యక్తిగా కొనసాగుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలలో వైట్-బాల్ సిరీస్ లలో ఓటములు, స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టుల్లో వైట్‌వాష్, దక్షిణాఫ్రికాతో సిరీస్ ఓటమి వంటి ఫలితాల నేపథ్యంలో గంభీర్ కోచింగ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్‌లో భాగంగా శ్రీలంకతో జరగబోయే రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ గంభీర్, అతని కోచింగ్ బృందానికి అత్యంత కీలకంగా మారింది. పలువురు కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా ఈ సిరీస్‌కు అందుబాటులో లేకపోవడం వారికి అదనపు సవాల్‌గా మారింది. ప్రస్తుతానికి ఈ చర్చలన్నీ అనధికారిక స్థాయిలోనే ఉన్నాయని, గంభీర్‌కు బోర్డు మద్దతు కొనసాగుతుందని స్పష్టమవుతోంది.

# స్పోర్ట్స్

## అర్ష్‌దీప్‌కు చోటు.. అభిషేక్ శర్మకు నిరాశ దులీప్ ట్రోఫీ నార్త్ జోన్ టీమ్ ఇదే



దేశవాళీ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ-2026 కోసం నార్త్ జోన్ తమ జట్టును ప్రకటించింది. ఆగస్టు 23 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో జట్టు సారథ్య బాధ్యతలను జమ్మూ కశ్మీర్‌కు చెందిన 24 ఏళ్ల వికెట్ కీపర్-బ్యాటర్ కన్హయ్య వాధ్వాన్ చేపట్టనుండగా, ఢిల్లీ ఆటగాడు ఆయుష్ బదోని వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ జట్టులో టీమిండియా పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, అన్షుల్ కంబోజ్‌లకు చోటు కల్పించారు. ఇటీవల రంజీ ట్రోఫీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జమ్మూ కశ్మీర్ జట్టు నుంచి కమ్రాన్ ఇక్బాల్, అబ్దుల్ సమద్, అబిద్ ముస్తాక్, సునీల్ కుమార్, యుధ్వీర్ సింగ్ వంటి పలువురు ఆటగాళ్లను సెలక్టర్లు ఎంపిక చేశారు. దేశవాళీ క్రికెట్‌లో వారు కనబరిచిన ప్రదర్శనకు దక్కిన గుర్తింపుగా దీనిని పేర్కొనవచ్చు. అయితే, పంజాబ్‌కు చెందిన స్టార్ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌లకు ఈ జట్టులో చోటు దక్కలేదు. మరోవైపు, టీమిండియా శ్రీలంక పర్యటన నేపథ్యంలో శుభ్‌మన్ గిల్, ఆకిబ్ నబీలు అందుబాటులో లేరని సెలక్షన్ కమిటీ స్పష్టం చేసింది. సీనియర్ ఆటగాడు పరాస్ డోగ్రా (41) పేరును కూడా సెలక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన కన్హయ్య వాధ్వాన్ తన ఫస్ట్-క్లాస్ కెరీర్‌లో ఇప్పటివరకు 16 మ్యాచ్‌లు ఆడి 883 పరుగులు చేశాడు. అతను 2018-19 సీజన్‌లో కేవలం 17 ఏళ్ల వయసులోనే రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేయడం గమనార్హం.

# నా శరీరాన్ని యంత్రంలా చూశాను: గాయంపై స్పందించిన రష్మిక

ప్రముఖ నటి రష్మిక మందన్న ఇటీవల తాను షూటింగ్ లో గాయపడడంపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తాను నటిస్తున్న 'మైసా' సినిమాలోని ఓ డ్యాన్స్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని తెలిపారు. తన గాయం గురించి, విశ్రాంతి గురించి వివరిస్తూ సోమవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. "గాయాలు చాలా బాధిస్తాయి. ఈ విషయం ఎవరికీ తెలియకూడదని నేను నిజంగా ఆశించాను. కానీ, ఇప్పుడు అందరికీ తెలిసింది. ఇన్ని రోజులు కనిపించనందుకు క్షమించండి. నేను మళ్ళీ వచ్చేశాను. ఇది జరిగి కొంతకాలం అయింది. వరుసగా ఇది నాకు మూడో గాయం. నా శరీరాన్ని యంత్రంలా కాకుండా, మనిషి శరీరంలా చూడటం నేను కచ్చితంగా నేర్చుకోవాలి" అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తన గాయం తీవ్రతను వివరిస్తూ, "ఈ గాయం గురించి ఎలా చెప్పాలంటే.. మన తుంటికి, కాలికి మధ్య నాలుగు టెండన్లు ఉంటాయి. వాటిలో నా కుడి వైపు ఉన్న ఒక టెండన్ తెగిపోయింది. అది మళ్లీ అతుక్కుంటేనే నేను కాలు పైకి ఎత్తగలను. 'మైసా' సినిమాలోని డ్యాన్స్ షూట్‌లో ఇది జరిగింది. నేను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో ఇదే అత్యంత అగ్రెసివ్ ఫిల్మ్ అని చెప్పొచ్చు. కానీ కంగారు పడకండి. నొప్పి ఉన్నా భరించలేనిది ఏమీ కాదు" అని ఆమె వివరించారు. ఈ గాయాన్ని దేవుడు తనకు బలవంతంగా ఇచ్చిన సెలవుగా భావిస్తున్నానని రష్మిక పేర్కొన్నారు. "నాకు నేనైతే ఎప్పుడూ బ్రేక్ తీసుకోను కాబట్టి, దేవుడే ఈ రూపంలో నాకు విశ్రాంతి ఇచ్చాడనిపిస్తోంది. నాకు తగిలిన ఈ గాయాలన్నీ యాదృచ్ఛికంగా జరిగినవే. ఇది బలవంతపు సెలవు అయినా, నేనేమీ బాధపడటం లేదు. ఈ సమయంలో చాలా పజిల్స్ పూర్తి చేస్తున్నా. వాటిలో నేను ఇంత బాగా ఆడతానని నాకు తెలియదు" అని ఆమె తెలిపారు. వర్కవుట్లు చేయలేకపోవడంపై తన ఆందోళనను కూడా పంచుకున్నారు. "నేను వర్కవుట్లు, రన్నింగ్ బాగా చేయడం వల్లే ఫిట్‌గా ఉంటాను. ఇప్పుడు కొంతకాలం వాటికి దూరంగా ఉండాలి. వర్కవుట్ చేయలేకపోతే నేను తినడం మొదలుపెడతాను. స్వీట్స్ ఎక్కువగా తింటాను. దానివల్ల బరువు పెరిగే అవకాశం ఉంది.



ప్రస్తుతానికి ఇదే నా అప్‌డేట్. త్వరలోనే మళ్లీ మిమ్మల్ని కలుస్తాను. ఎవరూ కంగారు పడకండి" అంటూ తన అభిమానులకు భరోసా ఇచ్చారు.

## నీట్ నిరసనలు: నటి భూమి పెడ్నేకర్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో దుమారం

బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నీట్-యూజీ 2026 నిరసనల్లో ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి కొందరు వాడిన అసభ్య పదజాలంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఈ దుమారానికి కారణమయ్యాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఒక వీడియోలో భూమి మాట్లాడుతూ.. నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుందని, అయితే ఆవేశంలో వాడే భాష సరిగా లేదని విమర్శించింది. "మన దేశ యువత మాట్లాడే పద్ధతి ఇది కాదు. దేశంలో అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి గురించి ఇలా మాట్లాడటం మన సంస్కృతి కాదు" అని ఆమె హితవు పలికింది. గౌరవప్రదమైన చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆమె అభిప్రాయపడింది. అయితే, భూమి పెడ్నేకర్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. జులై 20న విద్యార్థులు శాంతియుతంగా పార్లమెంట్ వైపు మార్చ్ చేస్తుండగా, పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేసి, టియర్ గ్యాస్ ప్రయోగించిన ఘటనను ఆమె ప్రస్తావించకపోవడాన్ని చాలామంది తప్పుబట్టారు. "విద్యార్థులపై జరిగిన హింసను వదిలేసి, వారు వాడిన భాష గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసం?" అని ఒక నెటిజన్ ప్రశ్నించాడు. "ఏసీ కార్లలో కూర్చుని సలహాలు ఇవ్వడం చాలా సులభం" అని మరో యూజర్ కామెంట్ చేయగా.. "మంత్రులు అసభ్య పదజాలం వాడినప్పుడు కూడా ఇలాగే స్పందిస్తారా?" అని ఇంకొకరు నిలదీశారు. విద్యార్థులపై జరిగిన దాడి, వ్యవస్థలోని లోపాలు వంటి అసలు సమస్యలను పక్కదారి పట్టించి, కేవలం భాషపైనే దృష్టి పెట్టడం సరికాదని పలువురు విమర్శించారు.



## శంకర్ కుమార్తె అదితి కొత్త చిత్రం 'వన్స్ మోర్' ఆగస్టు 28న గ్రాండ్ రిలీజ్!

ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న అదితి శంకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'వన్స్ మోర్'. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ రొమాంటిక్ డ్రామా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అర్జున్ దాస్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాను ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది. విఘ్నేశ్ శ్రీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మిలియన్ డాలర్ స్టూడియోస్ తమ సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని పంచుకుంది. "పండగ రోజు ఇదే. నిరీక్షణకు తెరపడి ప్రేమ మొదలయ్యే చోటు. మా ప్రేమ క్యాలెండర్‌లో ఇష్టమైన తేదీ దొరికింది. 'వన్స్ మోర్' ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది" అని పోస్ట్ చేసింది. ఈ సినిమాకు పలు ఆకర్షణలు ఉన్నాయి. ముఖ్యంగా, మలయాళంలో 'హృదయం', తెలుగులో 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్ అందించి సంచలనం సృష్టించిన ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్, ఈ సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన కొన్ని పాటలు సంగీత ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో మోడల్, నటి సోనా ఒలికల్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు అరవింద్ విశ్వనాథన్ సినిమా టోగ్రఫీ అందిస్తుండగా, నాష్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. రాజ్ కమల్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. మిలియన్ డాలర్ స్టూడియోస్ పతాకంపై యువరాజ్ గణేశన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హరీశ్ దురైరాజ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, విజయ్ ఎంపీ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.




## జ్యోతిక నాపై నమ్మకం ఉంచింది- అందుకే ఆ సాహసం చేశా: సూర్య

స్టార్ హీరో సూర్య తన 'కరుప్పు' సినిమా విడుదల సమయంలో ఎదుర్కొన్న తీవ్ర ఆర్థిక కష్టాల గురించి తాజాగా వెల్లడించారు. సినిమా విడుదలకు చివరి నిమిషంలో అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చిందని, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అండగా నిలబడిందని ఆయన తెలిపారు. ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో త్రిషతో కలిసి సూర్య నటించిన 'కరుప్పు' చిత్రం 2026 మే 14న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని ఆర్థిక సమస్యల కారణంగా ఒకరోజు ఆలస్యమైంది. తమిళనాడులో పంపిణీకి సంబంధించిన లావాదేవీలు కొలిక్కి రాకపోవడంతో ఆ రోజు ఉదయం షోలు రద్దయ్యాయి. దీంతో సూర్య స్వయంగా రంగంలోకి దిగి, వ్యక్తిగతంగా భారీ మొత్తం చెల్లించడంతో పాటు అదనపు నిధులు సమకూర్చి మే 15న సినిమాను విడుదల చేశారు. అనేక అడ్డంకులను దాటుకుని విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలన విజయం నమోదు చేసింది. ఈ నేపథ్యంలో 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఆనాటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. "ఈ విషయంలో జ్యోతికకు థ్యాంక్స్ చెప్పాలి. అది చాలా పెద్ద ఆర్థిక భారం. చివరి నిమిషంలో నా మీద పడింది. నేను అదనపు రుణాలు తీసుకుంటున్నప్పుడు ఆమె నాపై నమ్మకం ఉంచింది. ఒకవేళ ఏదైనా తేడా వస్తే, కుటుంబంగా మేమంతా కష్టాలు పడాల్సి వచ్చేది. అయినా ఆమె నా నిర్ణయాన్ని నమ్మింది" అని సూర్య వివరించారు. అయితే, జ్యోతిక మాత్రం ఈ ప్రశంసను స్వీకరించలేదు. "ఈ క్రెడిట్ నేను తీసుకోను. ఇదంతా పూర్తిగా ఆయన కృషే. సినిమాను విజయవంతం చేయాలనే ఆయన ఔదార్యం వల్లే ఇది



సాధ్యమైంది" అని ఆమె బదులిచ్చారు. ఈ విజయం వెనుక దర్శకుడు ఆర్‌జే బాలాజీ, ఇతర ఫైనాన్షియర్ల కృషి కూడా ఉందని సూర్య పేర్కొన్నారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449